క్లుప్తంగా

పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తిరుమలగిరి : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాలలో పాలిసెట్ 2025 పరీక్ష రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సత్తయ్య శుక్రవారం తెలిపారు. పాలిసెట్ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్న పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు నేటి నుంచి ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 90102 22177, 97040 41754లను సంప్రదించాలని కోరారు.

లోయపల్లిలో నేడు వైద్యశిబిరం

అర్వపల్లి : మండలంలోని లోయపల్లి గ్రామంలో శనివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం



ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

మద్దిరాల : మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారంగా మారుతుందని గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు బానిసై బంగారు జీవితాన్ని ఆగం చేసుకోవద్దన్నారు.

పశువైద్య శిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామపంచాయతీ ఆవాసం తూర్పుతండాలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, సిబ్బంది యాకయ్య, వైద్యులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు రైతుల గుండెల్లో గుబులు



ఆత్మకూర్ ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం

ఆత్మకూర్ (ఎస్) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానాయాతన పడుతున్నారు. ఆకాశంలో మబ్బులు పడితే రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులవుతున్నా నేటికీ కాంటాలు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. అధికారుల స్పందించి కాంటాలు త్వరితగతిన పూర్తి చేస్తేనే తాము బయటపడతామని లేకుంటే తీవ్ర నష్టాలు మూట కట్టుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం



తుంగతుర్తి : తూర్పుగూడెంలో జలబిందెలతో వెళ్తున్న గౌడ కులస్తులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో శ్రీకంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం నిర్వహించారు. శనివారం గంపలతో ప్రదక్షిణ నిర్వహించి కల్యాణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం

తుంగతుర్తి : మండలంలోని తూర్పుగూడెం గ్రామంలో కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు శుక్రవారం స్వామివారికి జలాభిషేకం చేశారు. అనంతరం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గౌడ కులస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి జలబిందెలతో అభిషేకం చేశారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడకులస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం

- వన మహోత్సవంపై అధికారుల ప్రత్యేక దృష్టి
- 3.50 లక్షలు నాటడమే లక్ష్యం
- రక్షణకు గ్రీన్ షెడ్లు ఏర్పాటు



జయరాంగుడితండా నర్సరీలో పెంచుతున్న మొక్కలు

చివ్వెంల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లోని నర్సరీల్లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాలతో పాటు పట్టణాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. నర్సరీల్లో మొక్కలు పెంచడం పైనే దృష్టిసారించిన సిబ్బంది, ప్రతిరోజు వాటికి నీటిని పట్టిస్తున్నారు. ఎండవేడిమికి మొక్కలు వాడిపోకుండా గ్రీన్ షెడ్లు సైతం ఏర్పాటు చేశారు. నర్సరీలపై గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. రోజువారీగా అధికారులు పనులు ముమ్మరం చేస్తున్నారు.

లక్ష్యం 3.50 లక్షలు..

వనమహోత్సంలో భాగంగా మండలంలో 3.50లక్షలు మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి నర్సరీలో 10వేల నుంచి 13వేల మొక్కలు పెంచేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మొక్కలు నాటేందుకు స్థలాల ఎంపిక కూడా జరిగింది. వర్షాలు కురవగానే మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేశారు. మొక్కలు నాటేందుకుగాను ఇప్పటికే అధికారులు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ, ఎంపీఓ, ఈజీఎస్ అధికారులు వేర్వేరుగా పంచాయతీ సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

మొక్కలునాటే స్థలాల ఎంపిక..

పంచాయతీల్లో మొక్కలు నాటే స్థలాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. 31పంచాయతీల్లోను ట్రాక్టర్లతో ఇప్పటికే రోడ్ల పక్కన మట్టిని తొలగిస్తున్నారు. రోజు వారీగా సిబ్బంది పనులు చేపడుతున్నారు. మొక్కలు నాటే ప్రదేశాలను ఎంపిక చేసి శుభ్రత పనులు చేపడుతున్నారు.

ప్రత్యేకంగా దృష్టిసారించాం

ఉపాధిహామీలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే ఎంపిక చేసిన నర్సరీల్లో పనులు జరుగుతున్నాయి. ప్రతి నర్సరీల్లో గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేసి మొక్కలను ఎండ నుంచి సంరక్షిస్తున్నాము. ఉపాధి పనులు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. వనమహోత్సవంలో పకడ్బందీగా మొక్కలు నాటించి, వాటిని సంరక్షించేందుకు ఏర్పాటు చేస్తాం.

– ఇరుగు నాగయ్య, ఏపీఓ, చివ్వెంల

బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి



చివ్వెంల : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆత్మకూర్ (ఎస్) : బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చివ్వెంల : బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాల, పీఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రేణుక, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గిరిప్రసాద్, రుబిన, జానిషరీఫ్, ఏడుకొండలు, కావ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో బడిబాట

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉల్లెందుల సైదులు, ఉపాధ్యాయురాలు ఆర్.స్రృజన, అంగన్‌వాడీ టీచర్ తొడుసు శివరంజని, ఏఏపీసీ ఛైర్‌పర్సన్ షమీనా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏపూరులో బడిబాట

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. ఏపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ప్రచారం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాసిత్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవి, నగేష్, రమణ, పుష్పకుమారి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ఫిర్యాదు

నాగారం : మండలంలోని ఈటూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగడం లేదంటూ గ్రామ యువకులు శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే భవన్‌లో ప్రజావాణి ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిటీ వైస్‌చైర్మన్ చిన్నారెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామానికి తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు పేరాల గోపి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పథకాలు కేవలం ఆ పార్టీ కార్యకర్తలకే ఇచ్చేవారని, ప్రస్తుత కాంగ్రెస్‌లో కూడా ఇందిరమ్మ ఇళ్లు 90 శాతం కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలకే కేటాయించారని ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీ అనేది పూర్తిగా కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్న కమిటీ అని వాళ్లు నిజమైన అర్హులకు న్యాయం చేయకుండా కేవలం పార్టీ వాళ్లనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట గ్రామస్తులు బోడ అశోక్ తదితరులు ఉన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తుంగతుర్తి : ప్రధాని నరేంద్రమోదీ జనగణనలో కులగణన నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అని బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణదాసు నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శమన్నారు. మోదీ ప్రభుత్వం సమాజం, దేశ హితాల పట్ల నిబద్ధత చూపుతుందన్నారు. కాంగ్రెస్, ఆ పార్టీ భాగస్వాములు కులగణనను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుంటున్నాయని అన్నారు. కులగణన నిర్ణయం పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు సాయిబాబా, సుధాకర్, నాగమ్మ, లింగయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి, స్కాన్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : అనుమతులు, అర్హతలు లేకుండా నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న శ్రీసాయిగణేష్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, ఆపిల్ స్కాన్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఆపిల్ స్కానింగ్ సెంటర్ నడుపుతున్న విషయం బయట పడినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. శ్రీసాయిగణేష్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ సందీప్ సైతం అర్హత లేకున్నా వైద్యం చేస్తున్నారని అన్నారు. నిర్లక్ష్య పూరితంగా విధులు నిర్వర్తించిన డీఎంహెచ్ఓపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గిరిజన శక్తి రాష్ట్ర నాయకుడు ధరావత్ వెంకటేష్‌నాయక్, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనిగా సంతోష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బాషిపంగు సునీల్, గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, చామకూరి మహేందర్, గౌతమ్, మధు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ పూర్తయిన వారిని రెగ్యులరైజ్ చేయాలి



కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను రెగ్యులరైజ్ చేసి గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు మే ఒకటి నుంచి 30వరకు వేసవి సెలవులు ప్రకటించిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సెక్టార్ ఏరియాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ అధికారులకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని, ఆ పోరాటాలు, ఆందోళన ఫలితంగానే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని నెలరోజులు సెలవులు ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో గర్భిణులకు, బాలింతలకు, ప్లేస్కూల్ పిల్లలకు ఆహారాన్ని ఇంటికి ఇవ్వాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని, వాటిని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సెక్టార్ అధ్యక్షురాలు గుద్దేటి శారద, కార్యదర్శి దార జ్యోతి, ప్రాజెక్టు నాయకులు కలకోట జ్యోతి, కారింగుల సావిత్రి, వీరమ్మ, సునీత, భాగ్యలక్ష్మి, రిజ్వానా పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

నూతనకల్ : పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి ఎం.రాములునాయక్ శుక్రవారం సన్మానించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 78మంది కాగాను 77మంది ఉత్తీర్ణత సాధించి 98.72శాతం ఉత్తీర్ణత సాధించడంతో విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పాఠశాల టెన్త్ ఫలితాల సీడీని ఆవిష్కరించి మాట్లాడారు. పది ఫలితాలలో ఈ పాఠశాల విద్యార్థిని శ్రావ్య 562 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, ఉపాధ్యాయుడు కోటమర్తి వీరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ

తుంగతుర్తి : రాజ్యాంగ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ ప్రారంభించి ఆమె మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మారగాని వెంకటయ్య, వీరమల్లు, రమేష్, వెంకన్న, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన

నాగారం : మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో భూ భారతి చట్టంపై శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అనంతరం మ్యూటేషన్, రికార్డుల సవరణలు, అప్పీళ్లు, సంక్షేమ పథకాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, సన్నబియ్యం పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, మేడిపల్లి వేణు, మంజుల, సిరిపంగి రాధ, స్రవంతి, శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారధి సభ్యులు

ఇసుక డంపులు సీజ్

నూతనకల్: మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామ శివారులోని పాలేరు వాగు సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఆర్ఐ కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఉగ్గిడి వెంకన్నతోపాటు మరో 10మంది రైతులు తమ పొలాల్లో సుమారు 350 ట్రిప్పుల ఇసుకను నిల్వ చేయగా పంచనామా నిర్వహించి సీజ్ చేసినట్లు తెలిపారు. 50 ట్రిప్పుల ఇసుకను బక్కహేమ్లతండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన ఇసుకను పంచాయతీ కార్యదర్శికి అప్పగించినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏపూర్ గ్రామానికి చెందిన కొండా నగేష్.. నూతనకల్ మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీఎన్‌రెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శ్రీరామ్ సాగర్ రెండవ దశ సాధన ప్రదాత బీఎన్.రెడ్డి 17వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎన్‌రెడ్డి భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రపంచం గర్వించదగ్గ పోరాటం చేశారని కొనియాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన ఆరుగురు అగ్రనాయకుల్లో బీఎస్ రెడ్డి ఒకరని అన్నారు. పట్టణంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద ఈ నెల 9న నిర్వహించే వర్ధంతి కార్యక్రమంలో ఆయన అభిమానులు, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, పట్టణ నాయకులు నక్క శ్రీనివాస్ ఏపూరి సోమన్న, మురపాక ఉగ్రయ్య, లింగంపల్లి ఓంకార్ పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం



తుంగతుర్తి : ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఎం వెంకట్రామనర్సమ్మ



అర్వపల్లి : వాలీబాల్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎస్ఐ బాలకృష్ణ

తుంగతుర్తి : వేసవిలో క్రీడల శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చిత్తలూరి వెంకట్రామనర్సమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో కబడ్డీ క్రీడాకారుడు, శిక్షణ శిబిరం డైరెక్టర్ చిటిపాక మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాన్ని స్థానికులతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు నిలయమైన వెంపటి గ్రామం జిల్లాలోనే ఏ గ్రామంలో నిర్వహించనీ విధంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలకు వేసవి శిక్షణ శిబిరంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, క్రీడలలో శిక్షణ ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఉచిత శిక్షణ ప్రారంభం

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించే వాలీబాల్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ కోరారు. జిల్లా యువజన క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించే శిక్షణను ఆయన శుక్రవారం ప్రారంభించారు. బిగ్‌హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో క్రీడాసామగ్రిని సమకూర్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్, పీడీ పి.మల్లేష్, పీడీలు యాదయ్య, విజయ్‌కుమార్, పీఈటీ సరిత, ఉపాధ్యాయులు వీరన్న, బిందులత, ఏఎస్ఐ ఎం.రాములు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంఈఓ వాసం ప్రభాకర్

నాగారం : వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం జానకి, ఉపాధ్యాయ బృందం సహకారంతో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి శిక్షణ తరగతులు ఈ నెల 2నుంచి నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జానకి, ఉపాధ్యాయులు, శ్రీనివాస్, కృష్ణయ్య, జానకిరాములు, సుధాకర్, వీరయ్య, వెంకటేశ్వర్లు, సీఆర్పీ హరిప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కులగణన అమలు సాధ్యం



భానుపురి (సూర్యాపేట) : పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కులగణన అమలు సాధ్యమైందని కాంగ్రెస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణ కులగణనతోనే కేంద్రం దిగివచ్చిందని, దీంతో బీసీ, ఎస్సీ ఎస్టీ అణగారిన వర్గాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, గండూరి రమేష్, పోలగాని బాలుగౌడ్, కరిముల్లా బేగ్, జావిద్, సిరివెళ్ల శబరి, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, పందిరి మల్లేష్, మాదా నవీన్, చందా దాసు, గద్దల శిరీష, దివ్య, సాజిత్ పాల్గొన్నారు.

కులగణనలో దేశానికి తెలంగాణ ఆదర్శం

అర్వపల్లి : కులగణనలో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని, జనాభా లెక్కలతో పాటు కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ విజయమని రాజ్యాంగ పరిరక్షణ యాత్ర మండల కోఆర్డినేటర్, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి అన్నారు. శుక్రవారం అర్వపల్లిలో జై బాపు జై భీం జై సంవిధాన్ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన చేసి సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ పి.సురేష్, నాయకులు అవిలయ్య, కృష్ణమూర్తి, మల్లయ్య, చిరంజీవి, వెంకన్న, నవీన్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి కమిటీలపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

సూర్యాపేట అర్బన్ : గీత కార్మికుల కుటుంబాలకు చెందిన మహిళలను శ్రీరామనవమి రోజున గుడిలోకి రాకుండా బహిష్కరణ చేసిన గ్రామ అభివృద్ధి కమిటీలపై చర్యలు తీసుకోవాలని గీత పనివారల సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ధర్మ భిక్షం భవనంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ తాళ్లరాంపూర్ గ్రామంలో సాంఘిక బహిష్కరణ చేసిన మహిళల కుటుంబాలకు చెందిన 100కుపైగా ఈతచెట్లను తగలబెట్టారని మండిపడ్డారు. ఆర్థికంగా నష్టపోయిన వారిని గుర్తించి తక్షణ నష్టపరిహారం ఇవ్వాలని, గ్రామ అభివృద్ధి కమిటీపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు అనంతుల జానయ్య, మహిళా సంఘం నాయకురాలు దేశగాని హేమలత పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నూతనకల్ : అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వైద్యసిబ్బంది

నూతనకల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి గంగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సామూహిక అన్నప్రసాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహార లోపంతో చిన్నారుల్లో ఎదుగుదల లోపించడం, గర్భిణులు బలహీనంగా మారి శిశు మాత మరణాలు సంభవిస్తున్నందున గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, రజినీ, అంగన్‌వాడీ టీచర్లు బండపల్లి అన్నపూర్ణ, బత్తుల రేణుక, ఆయాలు పాల్గొన్నారు.

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ టి.గోపి కోరారు. మండలంలోని వేల్పుచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన వీహెచ్ఎస్ఎన్‌డీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ ఖమ్మంపాటి ధనలక్ష్మి, ఆశా కార్యకర్త జ్ఞానసుందరి, ఆయా సుశీల, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అర్వపల్లి : వేల్పుచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ గోపి